క్లుప్తంగా

323 మందికి వైద్య పరీక్షలు



మునగపాకలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

మునగపాక: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం అనకాపల్లి సాగర్ హెల్త్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 323 మందికి వైద్య సేవలందించారు. ఈ శిబిరాన్ని వ్యాపారవేత్త ఆడారి రమణబాబు ప్రారంభించారు. వైద్యులు పోలినాయుడు,అనూష, రవీంద్ర దేవ్ వేచలపు వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో భీశెట్టి రామారావు, ఆడారి పోలయ్య,గంగమహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక యాత్రకు విద్యార్థుల ఎంపిక



ఢిల్లీ వైజ్ఞానిక యాత్రకు ఎంపికైన విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఢిల్లీలో నిర్వహించనున్న వైజ్ఞానిక యాత్రకు అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 24 వరకూ నిర్వహించే ఈ యాత్రలో భాగంగా ఢిల్లీ ఐఐటీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైజ్ఞానిక యాత్రకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



ధర్మ ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

మునగపాక: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు, కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ మత్స్యకార గ్రామాల్లో 502 దేవాలయాలు నిర్మించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, జోగినాయుడు, కో-కన్వీనర్ మళ్ల రఘు,మళ్ల శేషు, ధనలక్ష్మి,కాండ్రేగుల నూకప్పారావు, కుమారి, సూరిశెట్టి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన నేవీ నిర్వాసితుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా ఆదివారం 105 రోజు కొనసాగింది. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, వాడపాలెం, నేవీ పునరావాసకాలనీ, గోవిందపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాలకు చెందిన పలువురు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

శరవేగంగా పీహెచ్‌సీ భవన నిర్మాణం



పీహెచ్‌సీ నూతన భవనం

ఎస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. దాదాపు 95 శాతం పూర్తయింది. రూ.1.80 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. 11 గ్రామాల ప్రజలకు ఈ పీహెచ్‌సీ ద్వారా నిత్యం వైద్య సేవలు అందుతున్నాయి. కొత్త భవనం ప్రారంభమైతే మరింత సౌకర్యంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని వైద్యాధికారి శక్తి ప్రియ తెలిపారు.

నేటి నుంచి శూలాల సంబరం

● చుక్కలవాని లక్ష్మీపురంలో భారీ ఎత్తున ఏర్పాట్లు



రంగు రంగుల విద్యుత్ దీపాలతో స్వాగత ద్వారం



భావనా రుషి ఆలయం



ఆలయంలో ఉత్సవ మూర్తులు

నక్కపల్లి: మండలంలోని ప్రఖ్యాత గాంచిన చుక్కలవాని లక్ష్మీపురంలో భద్రావతి సమేత భావనారుషి ఉత్సవం(శూలాల సంబరం) ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రివరకు ఈ సంబరాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ప్రతీ ఏటా మాఘమాసంలో పద్మశాలీల ఆధ్వర్యంలో జరిగే ఈ సంబరాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివస్తారు. సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ, కల్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం విభూతి పండ్లు ఊరేగింపు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తారు. తదుపరి భజన కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారు కోలాటం నిర్వహిస్తారు.

అనంతరం నగర సంకీర్తన, దీపోత్సవం జరుగుతుంది. రాత్రి 7 గంటలనుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 11 గంటలకు శూలాల సంబరం అంగరంగ వైభవంగా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా పద్మశాలీలు శరీరంపై శూలాలు గుచ్చుకుని ప్రభలు పట్టుకుని తెల్లవార్లు జాగరణ చేస్తూ ఊరేగింపు జాతర నిర్వహిస్తారు. శూలాల మహోత్సవంలో భాగంగా ఆలయం వద్ద , గ్రామంలో పలు కూడళ్లు, వీధుల్లో భారీ ఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. భారీగా బాణాసంచా కాలుస్తారు. తదుపరి మంగళవారం సాయంత్రం రంగస్థలం అనే సాంఘిక నాటకం ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సంబరం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లాభాల పంట పుచ్చ

కోటవురట్ల: పుచ్చకాయల సాగు రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. దీంతో మండలంలో ఏటా పుచ్చ సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. వేసవికి మూడు నెలల ముందునుంచే ఈ సాగు చేపడుతున్నారు. మండలంలో సుమారు 60 హెక్టార్లలో సాగు చేశారు. జల్లూరు, బి.కె.పల్లి, నీలిగుంట, చినబొడ్డేపల్లి, కొడవటిపూడి, రామచంద్రపురం, కైలాసపట్నం తదితర గ్రామాల్లో పంటవేశారు.

3 నెలల్లో కోతకు..

విత్తు నాటిన తర్వాత 3 నెలల్లో కాపునకు వచ్చి ఫలసాయం అందుబాటులోకి వస్తుంది. నాటిన దగ్గర నుంచి సకాలంలో నీటి తడులు పెడుతూ ఉండాలి. తెగుళ్లు సోకకుండా గమనిస్తూ ఉండాలి.



పుచ్చ కాయల పంట

ఎకరా పరిధిలో సాగుకు విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం సుమారు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. పంట బాగుంటే ఎకరాకు 6 నుంచి 8 టన్నుల పుచ్చకాయలు దిగుబడివస్తాయి. ప్రస్తుతం టన్ను ధర రూ.5 నుంచి రూ.9 వేల వరకు ఉంది. పెట్టుబడి పోను సుమారు రూ.25 వేలు వరకు ఆదాయం లభిస్తుంది.

మార్కెటింగ్..

పుచ్చకాయల మార్కెటింగ్ కోసం రైతు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. దళారులు, వ్యాపారులే నేరుగా పంట దగ్గరకు వచ్చి కొనుగోలు చేస్తారు. నర్సీపట్నం, తుని, అనకాపల్లి, విశాఖ తదితర పట్టణాలకు పుచ్చకాయలు ఎగుమతి అవుతాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తిమ్మరాజుపేటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి,తిమ్మరాజుపేట గ్రామాల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986-87లో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం వాడ్రాపల్లిలోని పారిపల్లెమ్మ గుడి వద్ద నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు ఆట పాటలతో గడిపారు. వెలగా సురేష్‌కుమార్, ఎ.వి.ఎస్.మూర్తి, దాడి రమణబాబు, బి.ఎం.నాయుడు తదితరుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఇదే బ్యాచ్‌కు చెందిన కాండ్రేగుల జగదీష్‌ను ఘనంగా సత్కరించారు. తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మునగపాక హైస్కూల్‌లో 1989-90లో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశమయ్యారు. బొడ్డేడ రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెలగా శ్రీనివాసరావు,మోటూరు సూర్యనారాయణ,సనపల ప్రసాద్,కాండ్రేగుల శ్రీను,శ్రీరామమూర్తి,గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఆటపాటలతో సందడి చేశారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: గోకివాడలో నిర్మించిన లోవాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రికలను ఆదివారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) ఆవిష్కరించారు. ఈ నెల 16న లోవాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ కన్వీనర్ ఎన్.వి.సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు బాబ్జి, పందల శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి గోవింద, శానాపతి సూరిబాబు, ద్వారపురెడ్డి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా జరగని చెరువు లీజు వేలం

ఎస్.రాయవరం: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొరుప్రోలు చెరువు లీజు వేలం రెండేళ్లుగా జరగడం లేదు. దీంతో చేపల పెంపకం ద్వారా పంచాయతీకి వచ్చే కొద్దిపాటి ఆదాయం కూడా రాకుండా పోయింది. గతంలో ఈ చెరువు నుంచి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పంచాయతీకి ఆదాయం వచ్చేది. పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేపల పెంపకానికి సంబంధించి రెండేళ్ల నుంచి వేలం నిర్వహించలేదు. ఈ విషయాన్ని మండల స్థాయి అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ వారు కూడా పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి వేలం నిర్వహించాలని స్థానికులు కోరారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ సత్యనారాయణను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపామని చెప్పారు.



కొరుప్రోలు పంచాయితీలో చెరువు

కనులపండువగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి: గొల్లలకొండపై వెలసి ఉన్న సూర్య నారాయణమూర్తి స్వామి ఆలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన కల్యాణోత్సవం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అలంకరించిన వేదికపై స్వామి,అమ్మవార్లను అధిష్ఠంపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం ,చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

నక్కపల్లి: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం ద్వారా జరిగిన పనులకు సంబంధించి గ్రామాలవారీగా సోమవారం నుంచి సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)లు నిర్వహిస్తామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఆదివారం ఆయన సోషల్ ఆడిట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా జరిగిన పనుల్లో లోపాలు, అభ్యంతరాలను గుర్తించనున్నట్టు చెప్పారు. దీని కోసం ఇతర ప్రాంతాలనుంచి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. గ్రామాల్లో తనిఖీలు పూర్తయిన తర్వాత మండల స్థాయిలో గ్రామసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

గ్రామాల్లో గుర్తించిన లోటుపాట్లను అభ్యంతరాలను గ్రామసభలో తెలియజేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు,ఎస్ఆర్‌పీ రామారావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

యలమంచిలి: బ్రాండిక్స్ అపెరల్ ఇండియా పరిశ్రమకు అనుబంధంగా ఉన్న బ్రాండిక్స్ భారత్ ట్రస్ట్ పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. బ్రాండిక్స్ పరిశ్రమ ఆవరణలో ఆదివారం నిర్వహించిన 100వ కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శంకర్ ఐ ఫౌండేషన్ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య నిపుణులు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి కళ్లద్దాలు అందజేశారు. ఆపరేషన్ అవసరమైనవారిని గుర్తించారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని బ్రాండిక్స్ పరిశ్రమ భారతీయ భాగస్వామి దొరైస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండిక్స్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవంతంగా 100 కంటి వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. దాదాపు 39వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 26వేల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. 3,700 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ ప్రయత్నానికి స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం సహకరించారని చెప్పారు.



వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరైస్వామి

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దనున్న ఆలయం నుంచి గౌరమ్మను రథంపై దాడి వారి వీధి, గవరపేట మధ్య వీధి, పెద్ద గుమ్మం వద్ద శారదానది ఒడ్డు వరకు ఊరేగించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై రథాన్ని త్రాడుతో ముందుకు లాక్కుంటూ వెళ్లారు. ఆర్కెస్ట్రా పాటలు, బాణసంచా కాలుస్తూ ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు అమ్మ వారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం నది ఒడ్డున గౌరమ్మకు వేద మంత్రాల నడుమ పూజలు చేసి సంప్రదాయంగా నదిలో నిమజ్జనం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఉత్సవంలో అంధులు పలుచోట్ల పాడిన పాటలు అలరించాయి. భారీ ఎత్తున బాణ సంచా కాల్చారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, వేగి దొరబాబు, భీశెట్టి ఆనంద్, కోయిలాడ నాగు, తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.



శారదానదిలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు గృహసారథులు సైనికుల్లా పనిచేయాలని డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, వేంపాడు సర్పంచ్ ఏడిద నూకరత్నం తెలిపారు. వేంపాడులో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో 50 మంది గృహసారథులను నియమించినట్టు చెప్పారు. వీరంతా గ్రామంలో పర్యటించి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో చూడాలని తెలిపారు. వలంటీర్లతో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వపథకాలు అర్హులైన అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఈ పథకాలను ఆపివేస్తారని, మళ్లీ ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేలా చేస్తారని చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ సందేశాన్ని ప్రతీ లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి తెలియజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌రాజు,మొల్లి శ్రీను, చేకూరి నాగరాజు,పాము నాగేషు, సూరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మణిరాజు

బ్రాండిక్స్ పైపులైన్ల పనులపై మత్స్యకారుల ఆగ్రహం

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక తీరంలోకి బ్రాండిక్స్ యాజమాన్యం రెండో పైపు లైన్ వేయడం సరికాదని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పూడిమడకలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బ్రాండిక్స్ యాజమాన్యం తీరును వారు నిరసించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హుద్‌హుద్ తుపాను సమయంలో ధ్వంసమైన పైపు లైన్ల స్థానంలో కొత్తవి అమరుస్తున్నామని బ్రాండిక్స్ యాజమాన్యం చెబుతోందని, దానిలో వాస్తవం లేదన్నారు. రెండవ పైపులైన్లు వేస్తున్నారని తెలిపారు. బ్రాండిక్స్ పైపులైన్ల వల్ల చేపలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. మొగ వద్ద నుంచి ఉప్పుగల్లీల వరకూ ప్రవహించే ఏరులో చేపలు కూడా మరణిస్తున్నాయని తెలిపారు. బ్రాండిక్స్ యాజమాన్యం పెండింగ్ ప్యాకేజీలను వెంటనే అందజేయాలని లేకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న మత్స్యకారులు

దట్టంగా పొగమంచు



జాతీయ రహదారిపై పొగ మంచు

నక్కపల్లి: జాతీయ రహదారిపై సోమవారం ఉదయం దట్టంగా మంచు కమ్ముకుంది. పొగ మంచు కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించవలసి వచ్చింది. చిన్నకుల్లా మంచు కురిసింది. పలు గ్రామాల్లో ఉదయం 8గంటల వరకు మంచుతెరలు తొలగలేదు.ఈ పొగమంచు మామిడి జీడి తోటలపై తీవ్రప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మామిడి, జీడి తోటలు పూత దశలో ఉన్నాయి. పొగమంచు కారణంగా తెగుళ్లు వ్యాపిస్తామని పూత మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. పదిరోజుల నుంచి మంచు సాధారణంగా పడుతున్నప్పటికీ సోమవారం అధికంగా ఉండడంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. కొబ్బరి, అపరాలు సాగుచేసే రైతుల సైతం ఆందోళన చెందుతున్నారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం మంచు పరదాలో భక్తులకు సరిగా కనిపించని పరిస్థితి నెలకొంది.

ఉప ఎన్నికలకు ఓటర్ల జాబితాలు సిద్ధం

నక్కపల్లి: మండలంలో దేవవరం ఎంపీటీసీ సెగ్మెంట్‌తో పాటు, రేబాక, చినదొడ్డిగల్లు గ్రామాల్లో ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. దేవవరం పంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. గత ఎన్నికల్లో ఈ గ్రామ ఎంపీటీసీగా గొర్ల రాఘవకుమారి వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించారు. అంతకుముందు ఎన్నికల్లో ఆమె సర్పంచ్‌గా కూడా గెలవడంతో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ ఎన్నికకు సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించేందుకుగాను జాబితా సిద్ధం చేశారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితా కలెక్టర్ ఆమోదానికి పంపించిన తర్వాత ఆయన అనుమతితో మార్చి 2వ తేదీన ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. రేబాక, చినదొడ్డిగల్లులో రెండు వార్డు సభ్యుల పదవులకు కూడా ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, వాటి ఓటర్ల జాబితాలు కూడా సిద్ధం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాపై పంచాయతీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో

● చూడ ముచ్చటగ.. 'సూర్యకాంతం'



తిమ్మాపురం శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పొద్దుతిరుగుడు పూల తోట చూడముచ్చగా ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు అక్కడ ఫొటోలు దిగుతూ సందడి చేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఓ రైతు సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పొద్దు తిరుగుడు తోట వేశారు. ఆ పంట పసుపుపచ్చగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో ఈరోడ్డుపై వెళ్లే వారు వాహనాలు ఆపి తోటలోకి వెళ్లి ఫొటోలు తీసుకుని ఆనందించారు.అధిక సంఖ్యలో వాహనచోదకులు, ప్రయాణికులు ఆగడం వల్ల ఆదివారం ఈ ప్రాంతం సందడిగా మారింది.

– ఎస్.రాయవరం